క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: స్థానిక ఎస్‌పీసీ నాయుడు పార్కు వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఎస్‌పీసీ నాయుడు కుటుంబ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

జిల్లా పాస్టర్ల కమిటీ ఎన్నిక



పాస్టర్ల కమిటీ కార్యవర్గ సభ్యులు

చిత్తూరు రూరల్ : చిత్తూరు నగరంలోని ఇరువారం చర్చిలో శనివారం జిల్లా చర్చి పాస్టర్ల యూనియన్‌ను ప్రారంభించి, నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రవికుమార్, ఉపాధ్యక్షులుగా కుమార్, కార్యదర్శిగా రవి, కోశాధికాగారి బెంజిమెన్, కో–ఆర్డినేటర్లుగా బాలు, రమేష్‌ప్రసాద్, జయపాల్, పీటర్ భాస్కర్, జ్ఞానప్రకాశం, సంయుక్త కార్యదర్శిగా లాజర్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్లు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మనోజ్ (ఫైల్)

పూతలపట్టు: మండలంలోని వడ్డేపల్లి సమీపంలో ఉన్న బావిలో ఓ యువకుడు శవమై తేలిన సంఘటన శనివారం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు, తవణంపల్లె మండలం పైమాఘం గ్రామానికి చెందిన మునిరత్నం కుమారుడు మనోజ్(34) చిన్నప్పటి నుంచి బంధువుల ఊరైన పూతలపట్టు మండలం సామనత్తంలో ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి, బావిలో పడి మృతి చెందాడు. అటువైపు వెళ్తున్న వారు మృతదేహాన్ని గమనించి పోలీసులకు తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టు మార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ హరిప్రసాద్ అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీకి పది టన్నుల కూరగాయలు

పలమనేరు: పలమనేరుకు చెందిన శ్రీవారి సేవకులు కర్ణాటక రాష్ట్రంలోని పలు మార్కెట్లలో సేకరించిన పదిటన్నుల కూరగాయలను ప్రత్యేక వాహనంలో శనివారం తిరుమల నిత్యాన్నదాన పథకానికి పంపారు. గత కొన్నేళ్లుగా తాము రైతులు, మండీ యజమానుల నుంచి కూరగాయలను సేకరించి తిరుమల నిత్యాన్నదానానికి పంపుతున్నట్టు శ్రీవారి సేవకులు తెలిపారు. తొలుత కూరగాయల వాహనానికి పూజలు చేసి తిరుమలకు పంపించారు. నిర్వాహకులు కాబ్బల్లి రవి, గోపాల్ రెడ్డి, మధు, సురేష్, శ్రీకాంత్, సోమశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

కీలపట్లలో అన్నదానం



అన్నదానం చేస్తున్న జీవన్‌సాయి

పలమనేరు : గంగవరం మండలం కీలపట్లలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీకోనేటి రాయస్వామి ఆలయంలో శనివారం అన్నదానం చేశారు. పట్టణానికి చెందిన దాత జీవన్‌సాయి ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు ముందు రోజు పేరు నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు.

విత్తు నుంచి విక్రయం వరకు..



రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. రైతులకు ఉన్న ఊర్లోనే విత్తనాల నుంచి విక్రయం వరకు సేవలందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. తద్వారా రైతులకు అన్ని రకాలుగా వెన్నుదన్నుగా నిలుస్తూ వ్యవసాయాన్ని పండగలా మార్చింది. దీంతో చంద్రబాబు హయాంలో కూలీలుగా మారిన రైతులందరూ జగనన్న హయాంలో పొలంబాట పట్టారు.

- అన్నదాతకు వెన్నుదన్నుగా ఆర్బీకేలు
- రైతులకు అందుబాటులో అన్ని రకాల సేవలు



చిన్నవెంకటపల్లె రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఎరువులు అందిస్తున్న వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దేవేంద్రరెడ్డి

ఐరాల: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయం రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. నేడు వ్యవసాయం అంటే పండగలా మార్చిన ఘనత జగనన్నకే దక్కుతుంది. ప్రతి గ్రామంలో రైతులకు సమీపంలోనే ప్రతి గ్రామానికి ఒక రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేశారు. తద్వారా రైతులకు కావాల్సిన విత్తనాల నుంచి రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించే వరకు, వారికి కావాల్సిన ఎరువులు, మందుల కొనుగోలు, వ్యవసాయానికి కావాల్సిన యంత్ర పరికరాలన్నీ ఆర్బీకేల వద్ద అందుబాటులో ఉన్నాయి. రైతులు పండించే పంటలను ఈ క్రాప్ నమోదు చేసి ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన పంటలకు పరిహారం రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పిస్తోంది. పొలంబడి ద్వారా రైతులకు శిక్షణ అందించేందుకు ఆర్బీకేలు దోహదపడుతున్నాయి. భూసార పరీక్షలు, పురుగు మందులు, క్రిమిసంహారక మందులు అందించడంలో ఆర్బీకేలు అన్నదాతలకు అండగా ఉంటున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో నాలుగేళ్లుగా పథకాల లబ్ధి వివరాలు

వైఎస్సార్ రైతు భరోసా	రూ.23.06 కోట్లు
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	రూ.26.12 కోట్లు
వైఎస్సార్ సున్నా వడ్డీ సాయం	రూ.1.48 కోట్లు
వైఎస్సార్ యంత్రసేవా	రూ.12.24 కోట్లు

ఆర్బీకేల ద్వారా రైతు ముంగిటకే సేవలు

వ్యవసాయంలో విత్తు నుంచి పంట విక్రయం వరకూ అన్నదాతలకు అన్ని విధాలుగా తోడ్పాటు అందించేందుకు ఆర్బీకేలు ఉపయోగపడుతున్నాయి ఐరాల మండలంలో 5641 మంది రైతులు15,873 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఆర్బీకేల్లో కియోస్కోల ద్వారా నమోదు చేసుకున్న గంటల్లోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతులకు అందిస్తున్నారు. సాగులో పంటల వివరాలను ఈ–క్రాప్ ద్వారా నమోదు చేయడం, తద్వారా పైసా భారం పడకుండా పంటల బీమా, పెట్టుబడి రాయితీ, సున్నా వడ్డీ, పంట రుణాలు వంటి సంక్షేమ ఫలాలు రైతులకు అందిస్తున్నారు. వైఎస్సార్ భరోసా పథకం ద్వారా ప్రతి ఏటా రైతులకు పెట్టుబడి సాయం రూ.13,500 రైతుల ఖాతాలోకి జమవుతున్నది.

మా ఊర్లోనే ఎరువులు



టీడీపీ హయాంలో ప్రభుత్వం సబ్సిడీ కింద ఇచ్చే వేరుశనగ విత్తనాల కోసం అవస్థలు పడేవాళ్లం. రోజుల తరబడి మండలానికి వచ్చి గంటల కొద్దీ క్యూలో నిలుచుని, ఇబ్బందులు పడేవాళ్లం. సీఎం జగనన్న మాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్‌బీకేల ద్వారా మా గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– పి.నందకుమార్, సీ.వీ.పల్లి, ఐరాల

జగనన్న రైతు పక్షపాతి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి. కరోనా కష్టకాలంలో సైతం ఎంత భారమైనా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా రైతులకు రూ.13,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. మా లాంటి రైతులకు విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు డబ్బులు ఉపయోగపడుతున్నాయి. జగనన్న చేసిన మేలు ఎన్నటికీ మరిచిపోం.

– సి.ప్రతాప్‌రెడ్డి, రెడ్డివారిపల్లె, ఐరాల

పంటకు భరోసా



వర్షాలు, పెనుగాలుల వల్ల సాగు చేసిన పంట నష్టపోకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా రైతు భరోసా కేంద్రంలో పంటలకు ఈ–క్రాప్ నమోదు చేసుకుంటున్నాం. దీని కోసం ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందనే నమ్మకాన్ని రైతు భరోసా కేంద్రం కల్పించింది. రైతులకు విత్తనాల నుంచి మార్కెటింగ్ వరకూ ప్రభుత్వం అండగా ఉంటోంది.

– ఆర్.హరిరెడ్డి, మట్టపల్లె, ఐరాల

పాపసముద్రంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో డాక్టర్ సుకన్య

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ సుకన్య తెలిపారు. పాపసముద్రంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో పాటు మంచం పట్టిన రోగులు, బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రుక్మిణమ్మ, సోనియా, ప్రభావతమ్మ, బుజ్జమ్మ పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు జాగ్రత్తలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని పల్లెచెరువు గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్ ప్రియాంక 57 మంది రోగులకు వైద్య సేవలందించారు. గర్భిణులు, బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, జమున, ఎంఎల్‌హెచ్‌పీ శోభ, ఆశా కార్యకర్తలు భువన, సుజాత, శ్రీదేవి పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక సిద్ధం

ఐరాల: పాఠశాలలు పునఃప్రారంభం కాక ముందే జగనన్న విద్యాకానుక కిట్లు మండలానికి చేరాయి. గత టీడీపీ హయాంలో విద్యా సంవత్సరం పూర్తవుతున్నా పాఠ్య పుస్తకాలు అందే పరిస్థితి లేదు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభం కాకముందే జగనన్న విద్యా కానుక కిట్లు మండల స్టాక్ పాయింట్లల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. పాఠశాలలు తెరిచిన రోజునే కానుకల పంపిణీకి విద్యాశాఖాధికారులు అన్ని చర్యలు చేపట్టారు. తరగతుల వారీగా పాఠశాలలకు శనివారం నుంచి ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి పంపిణీ ప్రారంభించారు. వాహనాలను ఏర్పాటు చేసి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు.

3,180 మంది విద్యార్థులకు కిట్లు

మండలంలో 65 ప్రభుత్వ పాఠశాలలో 3,180 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్నారు. మండలానికి అవసరమైన పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేసింది. 26,000 పాఠ్య పుస్తకాలను సిద్ధం చేసింది. ఇంకా నోట్ బుక్స్ రావలసి ఉందని అధికారులు చెబుతున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు యూనిఫాం అందిస్తారు. 350 మంది 6వ తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందిస్తారు. 1 నుంచి ఐదో తరగతి 262 మంది విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీ అందజేయనున్నారు.



పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి

తొలి రోజే కానుకల పంపిణీ

ఈ నెల 12వ తేదీన ప్రభుత్వ బడులు తెరుచుకుంటున్నాయి. అదే రోజున విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయనున్నారు. విద్యార్థులకు అవసరమైన కానుకలను మండల ఉన్నత పాఠశాలలో సిద్ధం చేశారు. వాటిని పాఠశాలలకు పంపిస్తున్నాం. మండలంలోని 3,180 మంది విద్యార్థులకు 26,000 పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి.

– వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈఓ, ఐరాల

వినాయకుని సేవలో అనకాపల్లి ఎంపీ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని అనకాపల్లి ఎంపీ సత్యవతి శనివారం రాత్రి దర్శించుకున్నారు. రాత్రి ఎంపీ కుటుంబ సభ్యులతో కలసి విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఎంపీ దంపతులకు ఆశీర్వచనం అందించారు. అధికారులు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



స్వామివారి చిత్రపటం అందుకుంటున్న ఎంపీ దంపతులు

కర్ణాటక మద్యం పట్టివేత: ఒకరి అరెస్టు



పట్టుబడిన నిందితుడితో ఎస్‌ఈబీ అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసి, విక్రేతను అరెస్టు చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారుకు అందిన సమాచారం మేరకు, మద్యం అక్రమ విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సంతపేటకు చెందిన కిషోర్‌కుమార్ (40) వద్ద 22 ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. అధికారులు విక్రేతను అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీఐ జోగేంద్ర, ఎస్‌ఐ బాబు, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

జూలైలోపు పనులు పూర్తి చేయండి

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలోని జగనన్న హౌసింగ్ కాలనీల్లో ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న గృహాలన్నీ జూలై నెలాఖరుకు పూర్తిచేయాలని నగర కమిషనర్ జె అరుణ అధికారులను ఆదేశించారు. కమిషనర్ శనివారం ఉదయం నగరపాలక పరిధిలోని అనుప్పల్లి, బండపల్లి 1, 2 లేఅవుట్లను సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలను, పనుల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం గృహ నిర్మాణాలు జరుగుతున్న తీరుపై వార్డు అమినిటీ, ఇతర కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు, సూపర్‌వైజర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారుల వారీగా ఇళ్ల నిర్మాణాలు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయి, జూలై 31 నాటికి ఎన్ని పూర్తి చేయగలం అనే అంశాలపై సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ, లే అవుట్లలో ప్రస్తుతం ఆర్ఎల్, ఆర్సీ దశలో ఉన్న నిర్మాణాలను వేగవంతం చేయడం ద్వారా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. ఇందుకోసం లబ్ధిదారులకు అవసరమైన సహకారాన్ని అందించాలని, మేస్త్రీలు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. డ్వాక్రా సంఘాల ద్వారా అర్హులైన వారికి రుణాలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రుణాల పొందినవారు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీధర్, సీఎంఎం గోపి, టీపీవో మురళీకృష్ణ, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

విత్తన శుద్ధితో అధిక దిగుబడి సాధ్యం

గుడిపాల: పంటల సాగులో విత్తనశుద్ధి కీలకం. సరైన జాగ్రత్తలతో విత్తనశుద్ధి చేస్తే చీడపీడల నివారించి అధిక దిగుబడి సాధించవచ్చు. చిత్తూరు నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో 11 వేల హెక్టార్లలో వివిధ పంటలు సాగుచేస్తున్నారు. ఇందులో అత్యధికంగా 4 వేల హెక్టార్లకు పైగా వేరుశనగ, 270 హెక్టార్లలో వరి, 900 హెక్టార్లలో చెరకు పంటలను రైతులు సాగు చేసే పనిలో ఉన్నారు. ఇప్పటికే ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులకు అందజేసింది. గుడిపాల మండలంలో 1120 క్వింటాళ్లు, చిత్తూరు మండలంలో 870 క్వింటాళ్ల విత్తనకాయలను పంపిణీ చేసింది. వేరుశనగ సాగుకు సిద్ధమవుతున్న రైతులు విత్తనశుద్ధి చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచనలు ఇస్తున్నారు. మట్టి పరీక్షల ద్వారా భూసారాన్ని బట్టి ఎరువుల మోతాదును నిర్ణయించుకోవచ్చని చెబుతున్నారు.



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వేరుశనగ శుద్ధి ఇలా...

- ఒక కేజీ వేరుశనగ విత్తనానికి 3 గ్రాముల బావిస్టన్ లేక ఎం.45. లేదా సాఫ్‌పొడి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. దీంతో మొలకలు బాగా పెరిగి తెగుళ్లు రాకుండా నివారిస్తుంది.
- శుద్ధికి వినియోగించే మందులు విత్తనంలోకి చొచ్చుకొని పోయి శిలీంధ్రాలను నాశనం చేస్తాయి. విత్తనశుద్ధి తర్వాత మొలకెత్తిన లేత మొక్కలు నేలలో ఉన్న శిలీంధ్రాల నుంచి రక్షణ పొందుతాయి. దీంతో తక్కువ ఖర్చుతో పంటకు తెగుళ్లు, చీడపీడలు సోకకుండా చూసుకోవచ్చు.
- విత్తనశుద్ధిలో తగిన మోతాదులో మాత్రమే మందులు వాడాలి. మోతాదుకు మించి ఉపయోగిస్తే విత్తనం మొలకెత్తే శాతం దెబ్బతింటుంది.
- విత్తనశుద్ధి చేసేటప్పుడు రైతులు ముఖానికి మాస్కులు, చేతులకు తొడుగులు తప్పనిసరిగా ధరించాలి.
- విత్తనసాగు తరువాత 25లేక 35 రోజుల్లోపు ఆకుపచ్చ తెగుళ్ల సోకకుండా కాంటఫ్ మందును స్ప్రే చేయాలి.
- 90 రోజుల తరువాత బావిస్టన్‌ను స్ప్రే చేస్తే ఆకు బలంగా దృఢంగా ఉండి మంచి దిగుబడికి సాధ్యమవుతుంది.
- ఏవైనా సందేహాలకు గుడిపాల, చిత్తూరు వ్యవసాయ కార్యాలయం లేక గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు(ఫైల్)

మోతాదుకు మించి వాడొద్దు

వేరుశనగ విత్తనం సాగుచేసుకునే ముందు విత్తనశుద్ధి తప్పకచేసుకోవాలి. పంట సాగు అనంతరం మోతాదుకు మించి ఎరువులు, మందులు ఉపయోగించకూడదు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి. విత్తనాలు కొనుగోలు చేస్తే తప్పక బిల్లులు పొందాలి. స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి పంటసాగులో సలహాలు, సూచనలు పొందాలి.

– మాధవి, వ్యవసాయాధికారి, గుడిపాల